రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్వీజే విద్యార్థులు

విశాలాంధ్ర - కవిటీ : కవిటిలోని ఎస్వీజె విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సౌత్జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు మెనేజ్మెంటు బివివి. ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 11 వరకు బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్ 18 విభాగంలో కె.శిరీష (పరుగు), అండర్ 16 విభాగంలో జి.శివకాళి (లాంగ్ జంప్)లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారిని ఎస్విజె మేనేజ్మెంటు బివివి ప్రసాదరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఆందోళన ఉధృతం

విశాలాంధ్ర - సోంపేట : కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా బుధవారం సోంపేట విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరును నిరసించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లాకమిటీ సభ్యులు సంగారు లక్ష్మినారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అన్ని వర్గాల నోటిలో మట్టి కొడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి నేతలు ప్రస్తుతం విపరీతంగా చార్జీలు పెంచి ప్రజలపై ఎనలేని భారం మోపారని విమర్శించారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు ప్రస్తుతం అధాని కంపెనీకి మేలు చేకూరేలా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కప్ప గోపినాథ్, గిరిజన సంఘం నాయకులు జయరాం, సీపీఐ నేత పుక్కళ్ల అరేలమ్మ, గస్యా రఘునాథ్, కామయ్య, జయరాం, వరుణ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లు ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్తున్న ప్రధానో పాధ్యా యులు దిలీప్కుమార్ సాహు, సైన్సు ఉపాధ్యాయులు డి.హేమాచలంలకు సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్ది తమ పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టిన గురువులను సన్మానించు కోవడం నిజంగా గర్వంగా ఉందన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ బి.రేవతి, ప్రధానో పాధ్యాయులు వందన, ఉపా ధ్యా యులు రుద్రమూర్తి, సురేఖ, కోదండరావు, మోహనరావు, సుజాత, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి సహకరించండి : ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అన్నా దొరై

విశాలాంధ్ర - మందస : మండలం పట్టులోగాం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మధ్య ఆదిపత్య పోరు ఓ పక్క పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయుల పనితీరును వ్యతిరేకిస్తూ గిరిజన బాలికలు వారి తల్లిదండ్రులు గిరిజన సంఘాలు ఆందోళనలు మరోపక్క. గత 20 రోజులుగా జరుగుతున్నాయి. స్థానికంగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో గిరిజనులు ఐటిడిఏ పిఓకు ఫిర్యాదు చేశారు. సీతంపేట ఐటిడిఏ డిప్యూటీ డైరెక్టర్ అన్నా దొరై బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో జరుగుతున్న వ్యవహారం పైన విద్యార్థులు గిరిజనులు ఆందోళన అంశాలపై దర్యాప్తు జరిపారు. గిరిజన బాలికలు వారి తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గిరిజన సంఘాల ప్రతినిధుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు అందుకున్నారు. వారి మనోగతాన్ని తెలుసుకున్నారు. పాఠశాల పనితీరు పై ఆరా తీశారు. పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఉపాధ్యాయుల నుంచి వేరువేరుగా రాతపూర్వకంగా అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయులను బాలికల తల్లిదండ్రులను గిరిజన సంఘాల నాయకులను కోరారు. పాఠశాలలో వివాదాలు జరిగితే ఘర్షణ వాతావరణం నెలకొంటే పాఠశాల విద్యాభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఇక్కడ పాఠశాల పనితీరుపై సమగ్రమైన దర్యాప్తు జరిపి నివేదికను సీతంపేట ఐటిడిఏ పిఓకు అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ మల్లికార్జున రావు ఎంఈఓ లక్ష్మణరావు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ హ్యాకథాన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో క్వాంటమ్ వ్యాలీలో భాగంగా క్వాంటమ్ హ్యాకథాన్ పేరిట సాంకేతిక సవ సస్యల పరిష్కారానికి విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పోస్టర్ను బుధవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పోస్టర్ను ఆవిష్కరించారు. క్యాంపస్ స్థాయిలో ఈ నెల 17న జరిగే ఈ పోటీల్లో గణితం, భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొంటారని వీసీ చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు బీఆర్ఏయూ తరపున రాష్ట్ర స్థాయిలో జరిగే వ్యాలీ హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అదే విధంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పై పీఎం ఉషా పథకంలో భాగంగా వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు సెప్టెంబరు 2 నుంచి మూడు రోజుల పాటు ఎన్డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్, డాక్టర్ సీహెచ్. రాజశేఖర రావు, ఎస్వో డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి సిరిపురం సతీమణి త్రివేణి

విశాలాంధ్ర - కొత్తూరు : రాజకీయాల్లో ఎప్పుడు ఏమీ జరుగుతుందో చెప్పలేం తెలివి గల కొంత మంది నాయకులు ముందు జాగ్రత్తలు తీసుకుంటారు అలాంటి. నేతల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వర్రావు ఒకరు అని చెప్పాలి. రెండు సంవత్సరాలు క్రితం బీజేపీ పార్టీలో చేరిన సిరిపురం ఆ పార్టీలో క్రింది స్థాయి పదవీ చేపట్టకుండా నేరుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కాగలిగారు 2024 ఎన్నికల్లో పాతపట్నం బీజేపీ టిక్కెట్ ఆశించి బంగపడ్డారు రాబోయా 2029 సాధారణం ఎన్నికల్లో పాత పట్నం నియోజిక వర్గం నుంచి ఎంఎల్ఏ గా పోటీ చేయాలని గట్టిగా భావిస్తున్నారు అయితే రానున్న 2029 నియోజిక వర్గాల పునర్ విభజన జరిగి ఆ ఎన్నికల్లో.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వస్తే మన పరిస్థితి ఏమిటి అన్న ముందస్తు ఆలోచన బీజేపీ జిల్లా నేత సిరిపురంకు వచ్చినట్టుంది అందుకే ఎందుకైనా మంచిది అన్న ఆలోచనతో తన సతీమణి త్రివేణినీ బీజేపీలో పూర్తి స్థాయిలో మహిళా నేతగా తీర్చిదిద్దాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం ఒక నిర్ణయానికి వచ్చేరు అని విశ్వసనీయ సమాచారం 2029 ఎన్నికల్లో పాతపట్నం నుండి బీజేపీ అభ్యర్థి గా అవకాశం ఉంటే తాను లేకుంటే తన సతీమణి త్రివేణిని ఎన్నికల రంగంలో ఉండాలి అని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు గట్టిగా భావిస్తున్నారు. అని సమాచారం అందుకే ఈ మధ్య కాలంలో చాల మంది బీజేపీ. కేంద్ర నాయకులు కేంద్రమంత్రులను తన సతీమణి త్రివేణితో కలిసివేళ్లి వారితో బీజేపీ జిల్లా నేత సిరిపురం పరిచయాలు చేసుకున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - లావేరు : మండలంలో గుమ్మడం పంచాయతీ పరిధిలో గల వాళ్లేపేట గ్రామంలో రేషన్ షాప్ లేనందున గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి కూటమి సీనియర్ నాయకులు మజ్జి రామ్మూర్తి ఆగష్టు నెల రేషన్ బియ్యం సరఫరాకు వెహికల్ ను ఏర్పాటు చేసి గ్రామంలో నిత్యవసర సరుకులు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మజ్జి రామ్మూర్తి మాట్లాడుతూ వాళ్లేపేట గ్రామం లో ప్రతీ నెల వెహికల్ ఏర్పాటు చేసి డీలర్ ద్వారా రేషన్ బియ్యం సరఫరా చేస్తామని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు వాళ్లే వెంకటరమణ, రౌతు అప్పలనాయుడు, వాళ్లే మురళి, గొర్లే భువనేశ్, గొర్లే రామినాయుడు, వాళ్లే గోపాల్, వాళ్లే గోవింద, వాళ్లే సూర్యారావు, మీసాల కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల రామసత్యం నాయుడు, డీలర్ పాల్గొన్నారు.

సెల్ ఫోన్ దుకాణంలో చోరీ..రూ.1.20 లక్షలు నగదు అపహరణ

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటి రోడ్డులో గల బాలాజీ సెల్ ఫోన్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణంలో ఉన్న రూ.1.20 లక్షల నగదు అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, బాధితులు కథనం మేరకు పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన నిమ్మన షణ్ముఖరావు కాశీబుగ్గ కేటి రోడ్డులో బాలాజీ సెల్ ఫోన్ సర్వీసింగ్ సెంటర్ దుకాణం గత 15 ఏళ్ళుగా నిర్వహిస్తున్నారు. గత రెండు నెలలుగా సెల్ ఫోన్ సర్వీసింగ్ దుకాణం ముందు తాత్కాలిక టిఫిన్ దుకాణం కూడా పెట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో టిఫిన్ దుకాణం తెరిచేందుకు నిమ్మన షణ్ముఖరావుతో పాటు వాళ్ళ అన్నయ్య యువరాజ్ రాగా సెల్ ఫోన్ సర్వీసింగ్ దుకాణానికి వేసిన తాళాలు పగల కొట్టి టిఫిన్ దుకాణం సమీపంలో పడి ఉండడం చూసే సరికి సర్వీసింగ్ దుకాణాంలో ఉన్న రూ. 1.20 లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ, శ్రీకాకుళం క్లూస్ టీం పరిశీలించి వేలి ముద్రలను సేకరించారు. అలాగే పలాసలో నివాసం ఉంటున్న జినగ గోపాల్ కు సంబంధించిన టైలరింగ్ దుకాణం ఉంది. అదే సమయంలో కేటి రోడ్డు స్టైలిస్ట్ టైలరింగ్ దుకాణంలో చోరీ జరిగింది. కేవలం కుట్టిన మూడు జతల బట్టలు దొంగ తనం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అక్కడ కూడా క్లూస్ టీం వేనముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ పి సూర్యనారాయణ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీటీఎఫ్ 1938 రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్

విశాలాంధ్ర - కవిటీ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ అన్నారు. ఈ మేరకు బుధవారం కుసుంపురం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను యాప్ల భారం తొలగించి, ఆన్లైన్వర్క్ భారం లేకుండా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏపీటీఎఫ్ 1938 సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వివిధ పాఠశాలలను పరిశీలించారు. ఏపీటీఎఫ్ సంఘ భవనం అమరావతిలో నిర్మాణమునకు ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామ్యం వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీ బల్లెడ రవి, వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా మండలంలోని ఇద్దివానిపాలెం, బోరివంక, బల్లిపుట్టుగ, మాణిక్యపురం, ఆర్ బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేంద్ర, మండల అధ్యక్షులు బి.ధర్మా రావు, గౌరవ అధ్యక్షులు కె.రంగారావు, జిల్లా కార్యదర్శి శమళ్ల రాజబాబు, శ్రీరామమూర్తి, మొర్రి గోపి పాల్గొన్నారు.

ఐతమ్లో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని ఐతమ్ కళాశాలలో బుధవారం జరిగిన బాలికల ఆరోగ్యం - సామరస్యం అనే అంశముపై, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్ సుకన్య, డాక్టర్ జి చైతన్య కిరణ్,లు పాల్గొని మహిళలలో వచ్చే గర్భ, శ్వాసకోశ వ్యాధులు పై అవగాహన పరుచుటకు కళాశాల వుమెన్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కెవి.లలితా భవాని సమన్వయంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యంగా చదువుకున్న అమ్మాయిలు, బోజనము మరియు నిద్రలలో సమయపాలన పాటించక మానసిక వత్తిడి వలన ఇటువంటి అనారోగ్య సమస్యల బారిన పడడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సుకన్యకు కలశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు మెమంటో అందజేశారు.

సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయి

విశాలాంధ్ర - కవిటీ : ఉపాధ్యాయులకు తాము చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవో 1, 2లు ధనుంజయ మజ్జి, సనపల. రామకృష్ణలు అన్నారు. ఈ మేరకు బుధవారం మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృతి శ్రేష్టమైనదని బదిలీ అయిన గ్రామస్తులు జీవితాంతం గుర్తించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వైకుంఠరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు వన్ డే కంట్రీబ్యూషన్ ఆర్థిక సాయం

జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రూ. 4.08 లక్షల నగదు చెక్కు అందజేత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలో గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బి.సూర్యనారాయణకు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి బుధవారం వన్ డే కంట్రీబ్యూషన్ ఆర్థిక సాయం అందించారు. విధి నిర్వహణలో ఉండి ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన హోంగార్డులకు సహచర హోంగార్డులందరూ ఐక్యమత్యభావంతో తన తోటి హోంగార్డు కుటుంబానికి సహాయపడాలని వారి ఒక్కరోజు గౌరవ వేతనాన్ని సమకూర్చి అందజేయడం జరుగుతుంది. ఈ క్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత హోంగార్డు బి.సూర్యనారాయణకు హోంగార్డులందరూ సమకూర్చిన ఒక్కరోజు గౌరవ వేతనం సుమారు 4 లక్షల 8 వేల రూపాయల నగదు చెక్కును బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇచ్చిన నగదును కుటుంబ అవసరాలు, పిల్లల, కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా హోంగార్డులు తమ గౌరవ వేతనం లో ఒక రోజు వేతనాన్ని ఇలా సహచర హోంగార్డు కుటుంబాలకు అందజేయడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సి.హెచ్.గోపి నాథ్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు పారలేదు ...వరి నాట్లు పడలేదు

విశాలాంధ్ర - పోలాకి : ఈ ప్రాంతానికి ప్రాజెక్టు నీరు ఉన్నా రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్న అధికారులు సాగునీటిని అందించడంలో విఫలమయ్యారు. వంశధార ఎగుప్రాంతమైన పోలాకి మండలంలో చెల్లాయి వలస సుసరాం గంగివలస తదితర ప్రాంతాల్లో ఎదలు ఆకులు మాడి మాసైపోతున్న అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం అని మాజీ నీటి సంఘం అధ్యక్షులు సంపత్ రావు రామన్న వా పోయారు. వర్షాభావం పరిస్థితులు లేకపోవడంతో ఎండకు నారుమల్లు మాడి పోతున్నాయి అన్నారు. ఈ సందర్భంగా నీటి సంఘ మాజీ అధ్యక్షులు సంపత్ రావు రామన్న మాట్లాడుతూ బుధవారం దీనగాధను విలేకరులకు తెలిపారు. పోలాకి మండలంలో 17 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. దీనికి వంశధార ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇటీవల సాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ప్రాజెక్టులో గుర్రపు డెక్కలు విపరీతంగా ఉండటంతో ప్రాజెక్టులో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో ప్రవహించడం లేదు. జరుగుచున్న ఈ తంతు వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రామన్న ఆరోపించారు. గుర్రపు డెక్క మే జూన్ నెలలో తీసివేస్తే ఈ సమస్య ఉండబోదని రామన్న అభిప్రాయపడ్డారు.

అమ్మ పాలుకి మించిన ఔషదం లేదు : ప్రాజెక్టు అధికారి శోభారాణి

విశాలాంధ్ర - పోలాకి : అమ్మ పాలకు మించిన ఔషధం లేదని ఐసిడి ఎస్పిఒ అధికారి శోభారాణి అన్నారు. పోలాకి సెక్టర్ ఆధ్వర్యంలో ఆర్జెపురం అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలుకు మించిన శక్తిని ఇస్తుందని సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డ నిరోధక శక్తి పొందుతారని అన్నారు. తల్లిపాలు వలన బిడ్డ తేలికగా జీర్ణించుకో గల శక్తి ఉంటుందని తల్లిపాలుతో ఎన్నో లాభాలు ఉన్నాయని అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ తల్లి బిడ్డ సంరక్షణ మన బాధ్యతని బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరేమి ఇవ్వకూడదని అన్నారు. ఆహార పోషక ప్రాముఖ్యత వివరించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.వెంకటప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపీటీసీ ప్రతినిధి తూలుగు అశోక్, టి.గౌర్నాయుడు, సూపర్వైజర్లు శ్రీదేవి, బి.లక్ష్మి ప్రవంతి, కార్యకర్తలు వై.హేమలత, డి.సరోజిని, దుర్గ భాగ్యలక్ష్మి, రజని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వాడకంతో సమయం, ఖర్చు ఆదా

విశాలాంధ్ర - కవిటీ : రైతులు పొలాలలో యూరియా, పురుగు మందులు డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంతో సమయం, ఖర్చు ఆధా అవుతుందని సోంపేట ఏడీఏ భవానీశంకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జగతి, బెజ్జిపుట్టుగ రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్ స్ప్రేయింగ్ డెమో నిర్వహించి రైతులకు చూపించారు. ఎరువులను డ్రోన్ సహాయంతో వంట పొలాలలో స్ప్రేయింగ్ చేశారు. అలాగే వరిలో యాజమాన్య పద్ధతులు పాటించడం వలన దిగుబడులు పెరుగుతాయని, యూరియా మోతాదుకు మించి వాడరాదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో పి.శ్రీదేవి, ఉద్యానశాఖ అధికారిణి మాధవీలత, ఏఈవో కళ్యాణ్, విహెచ్ఏ రాధా, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - నరసన్నపేట : సమాజంలో విద్యార్థులు, ముఖ్యంగా మహిళలు సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కల్గి ఉండాలని జైరాజ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, వ్యవస్థాపకులు, దలై జైరాజ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా జైరాజ్ విద్యార్థులతో మాట్లాడుతూ యువత, మహిళలను లక్ష్యంగా చేసుకొని సైబర్ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో మన ప్రతీ కదలిక ఫోన్, గూగుల్ యాప్స్ ద్వారానే జరుగుతుంటాయని, దీనిని ఆసరా చేసుకొని సైబర్ దాడులు చేస్తారని అన్నారు. టెక్నాలజీపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, వ్యక్తిగత భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేశారు. ఫోన్లో ఉండే స్పైయింగ్ యాప్స్ను, గుర్తించే విధానం, గూగుల్ ద్వారా డేటా ఎలా లీక్ అవుతుంది, యాప్స్ అనుమతుల వల్ల వచ్చే ప్రమాదాలు, ఫేక్ లింక్స్, ఫేక్ అకౌంట్స్, మోసపూరిత యూపిఐ స్కామ్స్ వంటివి ఎలా జరుగుతాయో వివరిస్తూ, ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, పవన్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు పునరావాస కమిటీ సమీక్ష

విశాలాంధ్ర - శ్రీకాకుళం : మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి పునరావాస అంశాలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ సమావేశంలో టెక్కలి ఆర్డీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పునరావాస గ్రామాల నిర్మాణం, స్థలాల కేటాయింపు, మౌలిక వసతులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై చర్చించారు. తాగునీటి సరఫరా, రహదారి అనుసంధానం, పునరావాస ప్రక్రియ, విశేష గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాల వినియోగంపై అధికారులు చర్చించారు. పోర్టు రహదారికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, రైల్వే మార్గంలో చేయాల్సిన సాంకేతిక మార్పులపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వయంతో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు కమిటీకి సమర్పించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి కిరణ్ కుమార్, పంచాయతీరాజ్, నీటిపారుదల, రోడ్లు - భవనాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

టైల్యాండ్కు తోటపల్లి నీరు అందించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో క్యాంప్ కార్యాలయంలో బుధవారం తోట పల్లి అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్లో ఒక వారం రోజుల్లో టై ల్యాండ్కు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఈ సంవ త్సరం ఎట్టి పరిస్థితి లో రైతులకు వ్యవసాయ పనులకు నీరు అందించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ని ఫోన్లో సంప్రదించి ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిఈ లావణ్య, జెఈ, తహసీల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కవిటీ : కవిటి మండలం బొరివంక 11 కేవీ పీడర్నుందు ఆర్డీఎస్ఎస్ పనులు నిమిత్తం బొరివంక సబ్స్టేషన్ పరిధిలోని బొరివంక ఎగువవీధి, బొగిడియా పుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగాన పుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని పలాస విద్యుత్తు శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మన మిత్ర యాప్ సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం వివిధ వార్డుల సచివాలయాల పరిధి ప్రాంతాల్లో మనమిత్ర యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. లాలాపేట సచివాలయం పరిధిలోని చిన్నదేవర వీధి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 16వ వార్డు ఇన్ఛార్జి నాగరాజ్ పాత్రో మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏడాదిగా సుపరిపాలన అందిస్తు, రాష్ట్రంలోకి విదేశీ పెట్టుబుడుటు రాబడుతు, సూపర్ సిక్స్ హామీలను ఒకటొక్కటిగా అమలు చేస్తుందని, అర్హతల మేరకు ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించేలా నిరంతరం ప్రభుత్వ యంత్రాంగంతో పని చేయిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. వార్డు సచివాలయ విద్యా కార్యదర్శి విల్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 17వ వార్డు ఇన్ఛార్జి జనరల్ సంతోష్, 33వ బూత్ కన్వీనర్ రవికుమార్ గౌడో, దిలీప్ కుమార్ సాహు, సచివాలయ వార్డ్ రెవెన్యూ కార్యదర్శి కె.అప్పల రాముడు, ఏమినిటీస్ సెక్రటరీ కప్ప జయలక్ష్మి , ఆరోగ్య కార్యదర్శి ఎస్. ధనలక్ష్మి, మహిళా సంరక్షక కార్యదర్శి ఏ.కేదారజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. 9వ వార్డులో బత్తిన క్రిష్ణయ, 15వ వార్డులో ఎస్.కోటి, 4వ వార్డులో గేదెల శేఖర్, 7వ వార్డులో రంగాల శ్రీను తదితరులు ఆయా సచివాలయ సిబ్బందితో కలిసి మనమిత్ర యాప్ పై అవగాహన కల్పించారు.

బదిలీ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు

విశాలాంధ్ర - మందస : ఉద్యోగులకు బదిలీలు సహజమని వారు పనిచేసే కాలంలో అందించిన సేవలు మరువలేనివని కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూన వేణుగోపాలరావు అన్నారు. మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం సేవలందించి, ఇటీవల కాలంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు కూన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాలలో తెలుగు, హిందీ, సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేసిన యస్ అబ్రహం, పీ.రాంబాబు, యస్ కిరణ్ కుమార్లు ఈ ఏడాది జూన్ నెలలో బదిలీపై ఇతర పాఠశాల లకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తూ,వారు విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీతలు స్థానిక పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల పీయంసి ఛైర్పర్సన్ ప్రతినిధి కోమటి. తిరుపతి రావు, సర్పంచ్ కుటుంబ సభ్యులు యస్.ప్రకాశరావు, ఉపాధ్యాయులు యస్. గణేశ్వర రావు,జి. భీమారావు, జి.జానకమ్మ, యం. లక్ష్మణరావు, ఏ.అప్పారావు, బి.పాపమ్మ, యం.చిత్రసేను,యం. దామోదరం, జి.గోపాలకృష్ణ, అంగన్వాడీ సిబ్బంది వై.పార్వతి, టీ.జ్యోతి, మధ్యాహ్నభోజన సిబ్బంది, ఆయాలు మరియు విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

అనారోగ్యం బారిన పడిన వ్యక్తికి 'ఎస్.ఎఫ్.ఎస్' వితరణ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని జలుమూరు మండలం, గుండువలస గ్రామానికి చెందిన గొండు నీలయ్య పక్షవాతం బారిన పడి, అనారోగ్యంతో సతమతమవుతున్నందుకు ఆయన భార్య, సుశీలకు నిత్యావసర వస్తువులు, మందులు, కొంత నగదును స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీ (ఎస్.ఎఫ్.ఎస్) వితరణ చేశారు. సొసైటీ అధ్యక్షులు, ముద్దాడ కృష్ణతేజ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, కె.బి.డి. ప్రసాద్, మెట్ట ప్రవీణ్‌కుమార్, గుడ్ల సాయివిజయ్, భోగి రాంకుమార్, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను మోసగించిన బాబు : చింతాడ రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఎన్నికల ముందు చంద్రబాబు అలవికాని హామీల తో మహిళలను నమ్మించి గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించి మోసం చేశారని నియోజక వర్గ వైసీపీ కన్వీనర్ డాక్టర్ చింతా రవికుమార్ అన్నా రు. బాబు షూరిటీ మోసం గ్యారంటీలో మండల వైసిపి పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి అధ్యక్షతన తోటాడ, గోపి నగర్ లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోసం చేయడంలో చంద్రబాబు గణాపాటి అని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసామని ఎవరైనా కాదంటే వారి నాలిక మందమని చంద్ర బాబు చెప్పడం ప్రజాస్వామ్యాన్ని హతమార్చినట్టే నన్నారు. ఆరోగ్యశ్రీ లేక పేదలు అల్లాడిపోతున్నా రని గుర్తు చేశారు. ముఖ్యంగా ఫీజు రియంబర్స మెంట్ అందించక పోవడంతో విద్యార్థులతో పాటు తల్లి దండ్రులు కూడా వారి సర్టిఫికెట్లు అందక ఆవే దన చెందుతున్నారని జడ్పిటిసి, ఎంపీపీ ప్రతినిధి బెండి గోవిందరావు, తమ్మినేని శ్రీరామ్ మూర్తి అన్నారు. గత వైసిపి పాలనలో పేదవారికి ఇచ్చిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం ఏడాది పాటు నిలువు చేసింది అని ఆరోపించారు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొన్నిం టిని అరకొర అందించి మొత్తం ఇచ్చేసామన్నట్టు ప్రభుత్వ పెద్దలు చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ 14 నెలల్లో పేద ప్రజలకు 87 వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల కింద ప్రభు త్వం పేదలకు బకాయి పడిందని తెలిపారు. అర్హత ఉన్నవారికి పథకాలను అందించే ఘనత జగ న్మోహన్ రెడ్డి ది అయితే ఆ పథకాలను ఎలా కత్తి రించాలన్న నైజం చంద్రబాబుది అని విమర్శించా రు. ఈ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. పింఛన్ల కోత, ఆరోగ్యశ్రీ అమలు చేయకపోవడం, పేదవారికి ఇల్లు ఇవ్వకపోవడం వంటి అంశాలపై గ్రామాల్లోకి వచ్చిన కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెండి వెంక టరమణ, వైసీపీ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : జర్న లిస్టులకు అక్రిడేషన్ల జారీలో జాప్యాన్ని నిరోధించి జర్నలిస్టుల సమ్యలను తక్షణం పరిష్కారించాలని ఏ.పి.డబ్ల్యూ.జె ఆధ్వర్యంలో జర్నలిస్టులు డిమాండ్ చేసారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధ వారం స్థానిక తహశీల్దార్ ఎన్.వెంకట్రావుకు వినతి పత్రాన్ని అందించారు. గత పాలకపక్షం రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడేషన్ల గడువు పదే పదే పొడిగిస్తూ అడ్డగోలు నిబంధనలతో వేధించిందని,ద దాంతో హెల్త్‌కార్డులు పొందలేని దుస్థితి ఏర్పడిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొత్త అక్రిడేషన్ కార్డులు జారీ చేసి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. విశ్రాంత పాత్రికే యులకు ఇతర రాష్ట్రాల తరహాలో పింఛన్లు అందివ్వాలని కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తోట లోకేష్‌తో పాటు ఏ.పి.డబ్ల్యూ.జె ప్రతినిధులు ఎస్కే వేణుగోపాలాచార్యులు, పి. చిరంజీవి, నాగరాజ్ పాత్రో, ధనుంజయ్, రమణ, క్రిష్ణారావు పాత్రో, కోట రామా రావు, వై.అప్పారావు, ఎం.కేశవరావు తదితరులు వినతిపత్రాన్ని సమర్పించారు.

యూడీఎఫ్ అధ్యక్షుడు తండ్రి కర్రయ్యకు బత్తిని పరామర్శ

విశాలాంధ్ర - మందస : ఉద్దానం అభివృద్ధి వేదిక అధ్యక్షుడు సోర్ర రామారావు తండ్రి సోర్ర కర్రయ్య గత 8 ఏళ్ళ నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. గత రెండు రోజుల క్రితం కిడ్నీ వ్యాధి ఎక్కువ అవ్వడంతో డయాలసిస్ చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న డా.వై.యస్.ఆర్. ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ సభ్యుడు బత్తిని లక్ష్మణ్,యూ.డి.ఎఫ్ సభ్యులు బుధవారం కిడ్నీ పరిశోధన కేంద్రం మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి కర్రయ్యను పరా మర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలను చూసిన తరువాత చాలా ఆవేదనకు గురిచేసిందన్నారు. ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కొన్ని వేలమంది చనిపోవడం జరిగిందని నాడు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2 రూపాయలకు 20 లీటర్ల ఎన్.టి.ఆర్.శుద్ధజల నీరును అందించారని గుర్తు చేశారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ,మాజీ మంత్రి అప్పలరాజు చొరవతో శాశ్వత పరిష్కారం కోసం 200 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించారని, 800 కోట్ల రూపాయలతో ఇంటింటికి వైస్సార్ శుద్ధజలం ప్రాజెక్ట్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించినప్పటికి ఇంకా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు ప్రాణాల్ని కాపాడుకోలేకపోవడం చాలా బాధాకరమన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కిడ్నీ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన మందులతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని మరియు నిరంతరం నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఉద్దానం ప్రాంతంలోని ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు డిమాండ్ మేరకు కిడ్నీ వ్యాధితో చనిపోయిన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూ.డి. ఎఫ్ సభ్యులు దున్న గాంధీ, పిచ్చుక కిరణ్, బొడ్డు దాసు, బెలమర జీవన్,గుంటు కపిల్ పాల్గొన్నారు.

బదిలీ అధ్యాపకునికి సన్మానం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకునిగా సేవలందించిన ఎస్. నాగేశ్వర రావుకు బారువా కళాశాలకు బదిలీ జరిగింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో అధ్యాపక బృంధం అతన్ని ఘనంగా సత్కరించారు. సుదీర్ఘ కాలం పాటు స్థానిక కళాశాలలో విద్యార్థులకు కామర్స్ పాఠ్యాంశాలను బోధించి, కళాశాల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన సంఘటనలు గుర్తు చేసుకుని అతని సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతు నిస్వార్ధంగా అందించిన సేవలు తగిన గుర్తింపు ఇస్తాయని అన్నారు. ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమంలో అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, సంతోషకుమార్, త్రిపాఠీ, మోహనరావు, ఈశ్వరరావు, రాధ, వరప్రసాద్, బృందావనం, దేవరాజు, లోకేష్ పాల్గొన్నారు

తల్లిపాల వారోత్సవాల సమావేశం

విశాలాంధ్ర - నందిగాం : బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలు పెట్టాలని అవి శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్వైజరు శారదాబాయి అన్నారు. మండలం కొత్తఅగ్రహారం పంచాయతీ జద్యాడ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన 'తల్లిపాల వారోత్సవాలు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వశాంతికి దైవ కార్యక్రమాలు దోహదపడతాయి
ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : విశ్వ శాంతికి దైవ కార్యక్రమాలు దోహదపడతాయని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, అన్నారు. బుధవారం మండలంలో చోడవరం పంచాయితీ గెడ్డవానిపేట గ్రామంలో శ్రీ సుందర అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహొత్సవం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, రమణమూర్తి స్వామివారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు వేద పండితుల ఆధ్వర్యంలో చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా వుండేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను వైభవంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, పూతి రమణ, అడపా రజనీకాంత్, రావాడ కృష్ణ, కొంక్యాన బాబ్జీ, రాడ మౌళి, వెలుగు శ్రీరాములు, పిట్ట దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానాలతో సాగు : వ్యవసాయాధికారి అజయ్‌కుమార్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : రైతులు అధిక దిగుబడి తక్కువ ఖర్చులతో పొందడానికి సురక్షితమైన పంట విధానాలను ఆచరించాలని వ్యవసాయాధికారి అజయ్‌కుమార్ అన్నారు. ఈదుపురం గ్రామంలో మంగళవారం "పోలంపిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వ హించారు. రైతులకు వరి నాట్లు, ఎరువుల వినియోగం పై అవగాహన కల్పించారు. శాస్త్రీయ విధానాలను అనుసరించి సాగు పద్ధతులతో పంట వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. సమా దూరంతో నాట్లు వేయాలని, 2-3 మొక్కలకే పరిమితం కావాలని సూచించారు. మట్టిలో పోషక లోపం ఉన్నపుడు జింక్ సల్ఫేట్ వాడాలని తెలిపారు. విత్తనాలను నాటే ముందు శుద్ధి చేయడం, తేమ ఉండే సమయంలో నాట్లు వేసే మెలకువలు అవసరం అని అన్నారు. గ్రీవెన్స్ మాడ్యూల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలనుకునే ప్రతి ఒక్క గ్రామస్తుడు ముందుగా హౌస్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఆధార్ నెంబరు తప్పనిసరిగా నమోదు అయి ఉండాలని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసిన తరువాత, వాటి స్థితిని కూడా అదే లాగిన్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని, సమస్య పరిష్కారం అయ్యే దశలన్నింటినీ ట్రాక్ చేయడానికి ఇది అనుకూలంగా ఉంటుందని వివరించారు.

చిన్నప్పలనాయుడు మాస్టారును పరామర్శించిన జనార్ధనరావు

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఆమదాలవలస శాఖ, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధన రావు బుధవారం ఉదయం సరుబుజ్జిలి మండలం పాతపాడు గ్రామంలో ఇటీవలే స్వర్గస్తు లయిన టంకాల చిన్నప్పలనాయుడు మాస్టారు చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, తన సంతాపాన్ని తెలియపరిచారు. కార్యదర్శులు కాగితాపల్లి సంజీవరావు, కర్నేన జనార్ధన రావు మరియు మూడడ్ల శ్రీరాములు మాస్టారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

విశాలాంధ్ర - మందస : మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం గణిత ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల బదిలీలపై బుసాపద్ర ఎంపీ యు పి స్కూల్ కు బదిలీ అయిన సంక నారాయణారావును బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు.

బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సోంపేట : మండలం పలాసపురం గ్రామంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఇంటి యజమాని అశోక్ పాణి గ్రాహి ఇటీవల మరణించడంతో ఒరియా బ్రాహ్మణ అర్చక సంక్షేమ సంఘం సోంపేట తాలుకా పెద్దలు విరాళాలుగా సేకరించిన లక్షా 10వేల రూపాయల నగదును బుధవారం ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు గాంధీజీ పాణిగ్రాహి, సింహాచలం పాడి, రమేష్‌కుమార్ పాణిగ్రాహి, కూర్మ నాథ పాణిగ్రాహి, మురళీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని రావివలస పంచాయతీలో బుధవారం తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి గ్రామ పెద్దలు సర్పంచ్ బాలకృష్ణ, మాజీ సర్పంచ్ బడే జగదీష్, నర్తు కృష్ణ, బీసీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు హాజరయ్యారు. సూపర్వైజర్ ఎస్ సరస్వతి ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతను గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, అదనపు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు 6 నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రసన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

11 ఏళ్ల మోడీ పాలనపై గ్రామాల్లో బీజేపీ ప్రచారం

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం గురండి పంచాయతీలో గురండి, దాసారధిపురం, కాశీపురం గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షులు బురదా భాస్కరరావు ఆధ్వర్యంలో బీజేపీ ప్రచార రధంతో నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరిపాలన కరపత్రాలు గడప గడప కి అందించడం జరిగింది. నరేంద్ర మోదీ మన రాష్ట్రానికి, ప్రతి ఇంటికి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇస్తు న్నారని, కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయలు అనేక పథకాలకు సాయం చేస్తున్నారు అని,ఈ రోజు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత నిస్తుందని, నరేంద్ర మోడీగారు ప్రతి కుటుంబానికి ఎన్నో రకాలుగా విద్యా, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారు అని గ్రామాల్లో ఉండే ప్రజలకు గడప గడప కు బీజేపీ నాయకులు తిరిగి చెప్పడం జరిగింది. కొత్తూరు మండల బీజేపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతుంటే బీజేపీ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అధికారం లో రావాలని ప్రజలు కోరుకుంటున్నారు అని. అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కాపలా దమయంతి, పూర్వ జిల్లా కార్యదర్శి వలురౌతు ప్రసాద్ గారు, జాన్ కటారి గారు, ఇల్లం నాయుడు, యర్లంకి రమణయ్య, కటారి నవీన, మధు, బోర వినోద్, భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముందు పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదు : డీటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : విద్యార్థులు ఎంతో సరదాగా జరుపుకునే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సరిగ్గా నాలుగు రోజుల ముందు ఫార్మేటివ్ పరీక్షలను నిర్వహించడం సమంజసం కాదని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ క్రిష్ణారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఫార్మేటివ్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర విద్యాశాఖ అధికారుల తీరు పట్ల డిటిఎఫ్ అభ్యం తరం వ్యక్తం చేసింది. కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ఎంతో సరదాగా పాల్గొని ప్రావీణ్యం ప్రదర్శన చేస్తారు. సకాలంలో ఎస్సెస్మెంట్ పుస్త కాలను పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందజే యలేక ఆగస్టు 4వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన ఫార్మేటివ్ పరీక్షలను వాయిదా వేసిన అధి కారులు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆట లాడుకుంటున్నారు అని విమర్శించారు. పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన ఉపాధ్యాయులు ఇటు ఆటలు ఆడించలేక అటు పరీక్షలకు సన్నద్ధం చేయలేక సతమతమవుతున్నారు అని వివ రించారు. విద్యా శాఖ అధికారులు పునరాలోచన చేసి ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎండిపోతున్న వరినారుపై రైతుల ఆందోళన

విశాలాంధ్ర - సోంపేట : మండలంలోని అనేక గ్రామాల్లో ఖరీఫ్ సాగు కోసం రైతులు వేసిన వరినారుమళ్లు వర్షాలు లేక ఎండిపోతున్న పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బుధవారం తాళ్లభద్ర, మామిడిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లోను రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారి ప్రత్య క్షంగా వరినారుమళ్లను పరిశీలించారు. మరో నాలుగైదు రోజుల్లో వర్షం కురవకపోతే వరినారు ఎండిపోయే అవకాశం ఉంటుందని గుర్తించారు. కొత్తగా నారు పోసేందుకు స్వల్ప కాలిక రకాల విత్త నాలను రప్పించేందుకు ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. వడలిపోతున్న వరినారుకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకుంటే నాలుగైదు రోజులు రక్షించు కోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రమేష్ మాధురి పాల్గొన్నారు.

మత్తులో పడి జీవితాలను చిత్తు చేసుకోకండి : ఎస్ఐ కాంతారావు

విశాలాంధ్ర - ఆమదాలవలస : మత్తులో పడితే జీవితాలు చిత్తవుతాయని ఎస్సై టు ఎస్ కాంతారావు తెలిపారు. సంకల్పం కార్య క్రమం ద్వారా చైతన్య పరిచేందుకు ఆముదాల వలస గేటు ప్రాంతంలో బుధవారం మహిళలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు లో అరాచకాలు జరుగుతాయని వాటిని నియం త్రించేందుకు తక్షణమే దగ్గరలో ఉన్న పోలీస్ సహాయ, సలహా నెంబర్లను సంప్రదించాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయాలు కానీ సేవించడం కానీ మీ పరిధిలో జరిగితే తక్షణమే సహాయక కేంద్రా లకు తెలియజేయాలని కోరారు. పోలీస్ ఉన్నతా ధికారుల ఆదేశాలతో సంకల్పం కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేవిధంగా అవ గాహన కల్పిస్తున్నామన్నారు. మత్తుకు బానిసై జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని ఏఎస్ఐ గోపాల్ రావు తెలిపారు. మహిళలకు కలసిలకు మత్తు పదార్థాలు వినియోగంపై దాని నుండి జరిగే చెడు పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై అవగాహన

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా యువ ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీటీ జే వనిత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటును పొందడం మరియు వినియోగించుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఓటు బలమైన ఆయుధం అనీ, ఓటుతో ప్రభుత్వాలే మారతాయని విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, ఎలక్షన్ ఆపరేటర్, రెవెన్యూ సిబ్బందితో పాటూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కె. గొల్ల, వి.ల్యూక్ పాల్, వాసు బాబు, అధ్యాపకులు ఎస్. ధర్మారావు, కె.రెయ్యమ్మ, ఓ. కోటీశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టులోగాం ఆశ్రమ పాఠశాలను తహసిల్దార్ తనిఖీ

విశాలాంధ్ర - మందస : మండలం పట్టులోగాం గ్రామంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధ వారం మందస తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలించారు ఆశ్రమ పాఠ శాలలో ఉపాధ్యాయుల మధ్య విభేదాలు అంశం పైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులను, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వేరు వేరుగా వారు ఎదు ర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో ఎందువల్ల ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య జరిగిన వివాదాస్పదమైన విషయాలపై ఆయన విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు ఆయన తెలిపారు.

తల్లి పాలు ఎంతో శ్రేష్టం : డాక్టర్ కూర్మాన వినోద్‌కుమార్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూర్మాన వినోద్‌కుమార్ అన్నారు. మండలం సంత శీతా రాంపురం పరిధిలోని కింజ రాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బధవారం బెస్ట్ ఫీడింగ్ వీక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లా డుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అలాగే పిల్లలకు కూడా ఇన్ఫెక్షన్లు డయేరియా, వాంతులు వంటి సమస్యలు రావని చె ప్పారు. ప్రసవించిన తర్వాత బిడ్డకు 4 గంటల వ్యవధిలో తల్లిపాలు ఇవ్వొచ్చన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. మోష్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఔషధం వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల చెరువులో ఉపాధి పనులకు అనుమతి

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం గొల్లగండి పంచాయతీ పరిధిలో బీలలో ఉన్న ఉల్లిపాయల చెరువులో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు చేపట్టేందుకు రెవెన్యూ అధికారుల ద్వారా అనుమతులు లభించినట్లు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు గండుపల్లి చినరాజారావు తెలిపారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువులో ఉపాధి పనులు చేపట్టేందుకు ఎన్‌సిసి కంపెనీ గతం నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న విషయం తెల్సిందే. ఈ ప్రాంతంలో గల ప్రభుత్వ భూములను సుమారు 20 ఏళ్ల క్రితం థర్మల్ విద్యుత్ కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీకి విక్రయించిన విషయం తెల్సిందే. వాటిలో చెరువు కూడా నాదేనంటూ ఎన్‌సిసి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో చినరాజారావు కొన్నాళ్ల క్రితం సోంపేట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బంది పరిశీలనలో ప్రభుత్వ చెరువుగానే ఉందని తేలడంతో ఉపాధి పనులకు పచ్చజెండా ఊపారు. దీని పట్ల చినరాజారావు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు, ఉడా చైర్మన్ రవికుమార్‌కు, యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ దాసరి రాజుకు, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐతమ్‌లో మెగా వైద్య శిబిరం



విశాలాంధ్ర - టెక్కలి : మండలం లోని స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో కిమ్స్ ఆసుపత్రి, శ్రీకాకుళం సహకారంతో హృదయ సంబంధిత వైద్య పరీక్షల శిబిరం బుధవారం ఐతమ్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ శిబిరంలో కళా శాలలోని ఉద్యోగులు కు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, టుడి-ఎకో వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వ హించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.ఎ.ఎస్. శ్రీనివాసరావు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగేశ్వర రావు మాట్లాడుతూ కళాశాలలో ఇటువంటి శిబిరాలు నిర్వహించడం వలన సిబ్బంది ముందు గానే తమ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం ద్వారా ముందు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్య సమస్యలు నుండి బయట పడొచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డా.సత్విక్, క్యాంప్ కో ఆర్డినేటర్లు గోపి మరియు రాజశేఖర్ తమ వైద్య బృందంతో కలిసి చికిత్సలు, శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐతమ్ ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.వి. మారుతి ప్రసాద్ సమన్వయం చేశారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సరఫరా అవుతున్న పైపు లైన్ మరమత్తులకు గురికావడంతో మంచినీరు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో త్రాగునీరుకు సంబంధించి పైపులైను పద్మనాభపురం వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన పనులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు, డిఇ కనకరాజు ఎఇ కిరణ్ కుమార్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి
రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు

విశాలాంధ్ర - నరసన్నపేట : పాఠశాల విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమీషన్ మెంబర్, డి.కాంతరావు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో పి.ఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంధర్భంగా పాఠశాల విద్యార్థులకు అందచేసే ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. వంట ఏజెన్సీల నుండి భోజనాన్ని వడ్డించుకొని, రుచి చూశారు. ఈ సంధర్భంగా భోజనం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని పలు రేషన్ డిపోలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, శాంతారావు, దాలినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెంకటరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేదెప్పుడో : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం కవిటి మండలంలో లండారిపుట్టుగ, సిలగాం పంచాయతీలో గల గుజ్జుపుట్టుగ గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం వైసీపీ మండల అధ్యక్షులు, ఎంపీపీ ప్రతినిధి కడియాలు ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్యఅతిథిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, వైసిపి యువ నాయకులు నర్తు శివాజీ, వైకాపా నాయకులు పాల్గొన్నారు.